క్లుప్తంగా

చేతివృత్తులకు ప్రోత్సాహం



సర్టిఫికెట్లు అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజేష్

డోన్: కులవృత్తులను ప్రోత్సహించడం ద్వారా ఆర్థిక వ్యవస్థ బలంగా తయారయ్యే అవకాశం ఉందని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ అన్నారు. ఫోటాన్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో పీఎం విశ్వకర్మ యోజన కింద కులవృత్తిదారులకు ఏడు రోజుల పాటు శిక్షణ ఇచ్చారు. శిక్షణ పూర్తి కావడంతో మంగళవారం రూ.15 వేల విలువ చేసే పనిముట్లతో పాటు సర్టిఫికెట్లను మున్సిపల్ చైర్మన్ పంపిణీ చేశారు. రానున్న రోజుల్లో ఈ శిక్షణ పొందిన వారందరికీ రూ.3లక్షల రుణాన్ని కూడా సబ్సిడీతో ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ ప్రసాద్‌గౌడ్, ఇన్‌స్టిట్యూట్ ఇన్‌చార్జ్ సాయినాథ్, స్మిత తదితరులు పాల్గొన్నారు.

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు



సూచనలు చేస్తున్న ఎస్‌ఐ రమణయ్య

సంజామల: గ్రామాల్లో అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని.. అందరూ ప్రశాంత వాతావరణంలో జీవనం గడపాలని ఎస్‌ఐ రమణయ్య అన్నారు. సంజామల మండలం ఆకుమల్ల గ్రామస్తులతో ఎస్‌ఐ రమణయ్య మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. గ్రామాల్లో సమస్యలు సృష్టిస్తూ అల్లర్లకు పాల్పడే వారికి కఠినంగా శిక్షలు ఉంటాయని హెచ్చరించారు. బెట్టింగ్, పేకాట, మట్కా, మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. జూదం జోలికి వెళ్లి జీవితాలను నాశనం చేసుకోవద్దని హితవుపలికారు.

ఇళ్ల స్థలాలకు దరఖాస్తు చేసుకోండి

బేతంచెర్ల: మండలంలో నివాస స్థలం లేని పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తామని తహసీల్దార్ ప్రకాశ్‌బాబు మంగళవారం తెలిపారు. ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఇంటి స్థలం పొందని పేదలు గ్రామ సచివాయంలో దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. విచారణ జరిపి అర్హులైన పేదలకు ఇంటి స్థలాలు మంజూరు చేస్తామన్నారు.

బాల్య వివాహాలతో జీవితానికి సంకెళ్లు

సంజామల: బాల్య వివాహాలతో బంగారు భవిష్యత్తు, జీవితానికి సంకెళ్లు వేసినట్లేనని ఎంపీడీఓ సాల్మన్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్స్‌తో సమ్మర్ స్పెషల్ క్యాంపెయిన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. చిన్న వయసులో వివాహాలు జరిపితే భవిష్యత్‌లో అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. వారి భవిష్యత్తు నాశనం అవుతుందన్నారు. బాల్య వివాహాలను అరికట్టే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కౌమారదశ, సాధికారత, విద్య, ఆరోగ్యం, వ్యక్తిగత పరిశుభ్రత, పోక్సో చట్టం, బాల్య వివాహాల నిషేధ చట్టం అంశాలను వివరించారు. విజయకుమార్ రెడ్డి, ఈఓఆర్డీ రాధికరెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్స్ శాంత, సుగుణ పాల్గొన్నారు.

స్నేహితుల కుటుంబాలకు ఆర్థిక సాయం

డోన్ టౌన్: తమతో పాటు కలిసి చదువుకున్న ఇద్దరు స్నేహితులు మృతిచెందగా వారి కుటుంబాలకు ఆర్థిక సాయం చేసి గొప్ప మనసు చాటుకున్నారు ఆ మిత్రులు. సంతోషంలో ఉన్నప్పుడే కాదు ఆపదలో ఉన్నప్పుడు కూడా అండగా ఉన్నవాడే నిజమైన స్నేహితులు అని నిరూపించారు. వారంతా మండలంలోని చిన్నమల్కాపురం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 2003–2004లో పదో తరగతి కలిసి చదువుకున్నారు. అయితే ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో కమలాపురం గ్రామానికి చెందిన మిత్రుడు షేక్షావలి, అనారోగ్యంతో మరో మిత్రుడు పెద్ద మల్కాపురం గ్రామానికి చెందిన బాబయ్య మృతిచెందారు. చందాలు వేసుకుని షేక్షావలి కుటుంబానికి రూ.25వేలు, బాబయ్య కుటుంబానికి రూ.26వేలు అందజేశారు. అండగా ఉంటామని భరోసా కల్పించారు. కట్టెల వెంకటేశ్వర్లు, హుస్సేన్ బాషా, మహేష్, కిషోర్, జనార్దన్, రాంమోహన్, చంద్రశేఖర్ ఉన్నారు.

సామరస్యంగా పరిష్కరించుకోవాలి

కోవెలకుంట్ల: ఏవైనా సమస్యలు తలెత్తితే సామరస్యంగా పరిష్కరించుకోవాలని కోవెలకుంట్ల ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి సూచించారు. మంగళవారం రాత్రి పట్టణంలోని బాబానగర్‌లో నెలకొన్న స్థల వివాదాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం ముస్లింతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్‌ఐ మాట్లాడుతూ.. శాంతియుత వాతావరణంలో సమస్యలకు పరిష్కారం లభిస్తుందని.. అవసరమైతే పోలీసుల సహాయం తీసుకోవాలని పేర్కొన్నారు. అల్లర్లు, గొడవలకు పాల్పడి శాంతి భద్రతలకు భంగం వాటిల్లేలా ప్రవర్తిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఉత్తమ ఫలితాలకు కేరాఫ్

- ప్యాపిలి ప్రభుత్వ జూనియర్ కళాశాల
- ఏటా పెరుగుతున్న ఉత్తీర్ణతా శాతం
- ప్రైవేటు, కార్పొరేటుకు ధీటుగా బోధన
- ప్యాపిలిలో చదివేందుకు ఆసక్తి చూపుతున్న విద్యార్థులు



ప్యాపిలి ప్రభుత్వ జూనియర్ కళాశాల

ప్యాపిలి: ప్రస్తుతం ప్రైవేటు, కార్పొరేటు కళాశాలల హవా నడుస్తోంది. అప్పులు చేసైనా తమ పిల్లలను ప్రైవేటు కళాశాలల్లోనే చదివించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపుతారు. కానీ ప్యాపిలిలో పరిస్థితి మాత్రం ఇందుకు భిన్నంగా ఉంటోంది. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు సాధిస్తున్న ఉత్తమ ఫలితాలు, ఉత్తీర్ణతా శాతం విద్యార్థుల తల్లిదండ్రుల ఆలోచనల్లో మార్పు తీసుకొచ్చింది. దీంతో వేలాది రూపాయలు వెచ్చించి ఎక్కడో దూర ప్రాంతాల్లోని ప్రైవేటు కళాశాలల్లో తమ పిల్లలను చదివించడం కంటే స్థానికంగా ఉన్న ప్రభుత్వ కళాశాలలో చదివించడం మంచిదనే అభిప్రాయంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఉన్నారు. దీంతో ప్యాపిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏటా ఉత్తీర్ణతా శాతం పెరుగుతోంది. అంతే కాకుండా విద్యార్థులు సాధిస్తున్న మార్కులు సైతం ప్రైవేటు, కార్పొరేటు విద్యార్థులకు ఏమాత్రం తీసిపోని విధంగా వస్తున్నాయి.

మార్కుల్లో టాపర్లు

స్థానిక కళాశాలలో ప్రతి సంవత్సరం వంద మందికిపైగా విద్యార్థులు ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరుతున్నారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులతో కలిపితే విద్యార్థుల సంఖ్య 220 వరకు ఉంటోంది. గత నాలుగు సంవత్సరాల్లో కళాశాల ఉత్తీర్ణతా శాతం పెరుగుతూ వస్తోంది. 2022లో 43 శాతం, 2023లో 54 శాతం, 2024లో 58 శాతం, 2025లో 78 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. 2020 ఏడాదిలో బైపీసీలో లావణ్య 956 మార్కులు, 2021లో జయంతి(ఎంపీసీ)–917, 2022లో జోత్స్న (బైపీసీ)–827, 2023లో మానస(బైపీసీ)–976, 2024లో ప్రియాంక (ఎంపీసీ)–955, సనోవర్‌భాను (హెచ్‌ఈసీ)– 933, 2025లో రవికిరణ్ (ఎంపీసీ)–910 మార్కులతో ప్రతిభ చాటారు.



కళాశాల విద్యార్థులు

మూతపడిన ప్రైవేటు కళాశాల

ప్యాపిలిలో దాదాపు పదేళ్ల పాటు నిర్వహించిన ప్రైవేటు జూనియర్ కళాశాల కొద్ది సంవత్సరాల క్రితం మూతపడింది. ప్రభుత్వ కళాశాల విద్యార్థులు మంచి ఫలితాలు సాధిస్తుండడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ప్రైవేటు కళాశాలకు తమ పిల్లలను పంపడానికి ఆసక్తి చూపడం లేదు. విద్యార్థులు చేరకపోవడంతో ప్రైవేటు కళాశాల నిర్వాహకులు కొద్ది సంవత్సరాల క్రితం ఆ కళాశాలను మూసివేశారు.

నాలుగేళ్లలో విద్యార్థుల ఉత్తీర్ణత వివరాలు	
ఏడాది	ఉత్తీర్ణత శాతం
2021-22	43
2022-23	54
2023-24	58
2024-25	78



కళాశాల వరకు ఏర్పాటు చేసిన సీసీరోడ్డు

నాడు–నేడుతో మారిన రూపురేఖలు

ప్యాపిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులతో కళాశాల రూపురేఖలే మారిపోయాయి. మౌలిక వసతులు లేని కారణంగా గతంలో ఇక్కడ చదివేందుకు విద్యార్థులు ఆసక్తి చూపించేవారు కాదు. నాడు–నేడు పనుల్లో భాగంగా అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.38 లక్షలతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టింది. ఈ నిధులతో మరుగుదొడ్ల నిర్మాణం, ఫ్లోరింగ్, రూఫింగ్ మరమ్మతు పనులు, ఆర్‌ఓ ప్లాంట్ ద్వారా తాగునీటి సౌకర్యం, స్టేజీ నిర్మాణం, కళాశాలలో పిచ్చి మొక్కలు పెరగకుండా బెడ్డింగ్, వాటర్ ట్యాంక్ నిర్మాణం, మెయిన్ రోడ్డు నుంచి కళాశాల వరకు సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. దీంతో కళాశాలకు అన్ని సౌకర్యాలు సమకూరాయి. కళాశాలలో మౌలిక సదుపాయాలకు తోడు నాణ్యమైన విద్య ఉచితంగా లభిస్తుండడంతో ప్యాపిలి మండలంలో ఇంటర్ విద్యార్థులకు ప్రభుత్వ జూనియర్ కళాశాల కల్పవృక్షంలా మారింది.

సమష్టి కృషితోనే మంచి ఫలితాలు



కళాశాలలో అన్ని సబ్జెక్టుల లెక్చరర్లు అంకితభావంతో పని చేస్తున్నారు. విద్యార్థులు కళాశాలకు ఒక్కరోజు గైర్హాజరైనా వెంటనే ఫోన్ ద్వారా తల్లిదండ్రులకు విషయాన్ని తెలియజేస్తున్నాం. ప్రతి రోజూ నిర్వహించే తరగతులతో పాటు స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నాం. సమష్టి కృషి ఫలితంగా ప్రతి సంవత్సరం ఉత్తీర్ణతా శాతం పెరుగుతోంది. వచ్చే ఏడాది మరిన్ని మంచి ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తాం.

–సుబ్రహ్మణ్యం, ప్రిన్సిపాల్

ఎవరికీ నష్టం కలగకుండా రీసర్వే



మాట్లాడుతున్న ఆర్డీఓ నరసింహులు

డోన్ టౌన్: పకడ్బందీగా రీసర్వే పనులు చేయాలని.. ఎవరీ నష్టం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆర్డీఓ నరసింహులు మండల సర్వేయర్లు, సచివాలయ సర్వేయర్లు, గ్రామ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో రీసర్వేపై అధికారులు, సిబ్బందికి శిక్షణతో పాటు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. సర్వే సమయంలో భూమికి సంబంధించిన యజమాని, రైతు తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. సర్వే ముగిసిన తర్వాత వివరాలను మండల కేంద్రంలో సమర్పించాలని ఆదేశించారు. సర్వే చేసే సమయంలో ఏవైనా అనుమానాలు ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని తెలిపారు. సొంత నిర్ణయాలు తీసుకుని ఇబ్బందులు తీసుకురావద్దన్నారు. డోన్ తహసీల్దార్ నాగమణి, మండల సర్వేయర్ జగదీష్ కుమార్, సర్వేయర్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఈకేవైసీకి నేడే చివరి తేదీ



ఈకేవైసీ వేస్తున్న లబ్ధిదారులు

అవుకు: రేషన్‌కార్డుల్లో ఉన్న లబ్ధిదారులు ఈకేవైసీ చేసుకోవడానికి గడువు నేటి (బుధవారం)తో ముగియనుంది. కార్డులోని సభ్యులందరూ తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. గడువు దగ్గరపడడంతో మంగళవారం రేషన్ డీలర్లు ఈకేవైసీ ప్రక్రియను ముమ్మరంగా చేశారు. అవుకు మండలంలో 15,800 రేషన్‌కార్డుదారులు ఉండగా అందులో 45,962 మంది సభ్యులు ఉన్నారు. వీరిలో 42,247 మంది ఈకేవైసీ ప్రక్రియను పూర్తి చేసుకున్నట్లు సమాచారం. మిగిలిన 3,715 మంది సభ్యుల్లో 1094 మంది 0–5 సంవత్సరాల వయస్సు ఉన్న పిల్లలు, 13 మంది 80 వయస్సు దాటిన సభ్యులు ఉన్నారని.. వారికి ఈకేవైసీ అవసరం లేదని అధికారులు చెబుతున్నారు. ఇంకా 1,324 మంది సభ్యులు ఈకేవైసీ చేసుకోవాల్సి ఉంది. ఈకేవైసీ పూర్తి చేసుకోకుంటే రేషన్ నిలిపివేస్తామని అధికారులు స్పష్టం చేశారు.

ప్రకృతి వైపరీత్యాలపై అవగాహన



ప్యాపిలి: అవగాహన కల్పిస్తున్న డీవైఎఫ్‌ఓ

ప్యాపిలి: ప్రకృతి విపత్తులు ఎదురైనప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని డీవైఎఫ్‌ఓ చిదంబరయ్య, తహసీల్దార్ భారతి, ఎంపీడీఓ శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ప్రస్తుతం వాతావరణంలో తలెత్తుతున్న మార్పుల కారణంగా వడగాల్పులు, ఆకాల వర్షాలు, పెను గాలులు, ఉరుములు, పిడుగులు వంటి విపత్తులు కలుగుతున్నాయన్నారు. పిడుగులు పడే సూచనలు ఉన్న సమయంలో ప్రజలు సురక్షిత ప్రాంతాల్లో ఉండే విధంగా వారికి అవగాహన కల్పించాలన్నారు. వడ దెబ్బకు గురికాకుండా తరచూ ఓఆర్‌ఎస్ ద్రావణం లేదా మంచి నీటిని తాగాలన్నారు.

- **బనగానపల్లె రూరల్:** ప్రకృతి వైపరీత్యాల సమయంలో అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు సేవలందించాలని తహసీల్దార్ నారాయణరెడ్డి, ఎంపీడీఓ వెంకరమణ అన్నారు. స్థానిక పొదుపు భవనంలో డిజాస్టర్ రిస్క్ రిడక్షన్ మేనేజ్‌మెంట్ అనే అంశంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రజలను అప్రమత్తం చేసి వారికి కావాల్సిన సదుపాయాలను కల్పించాలని సూచించారు. డీఆర్‌డీఏ ఏపీఎం శ్రీనివాసులు, సీడీపీఓ ఉమామహేశ్వరమ్మ, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.
- **బేతంచెర్ల:** గ్రామాల్లో విపత్కర పరిస్థితులు ఎదురైనప్పుడు అధికారులు ప్రజలకు సమాచారం అందించేలా అత్యవసర నంబర్లను అందుబాటులో ఉంచాలని తహసీల్దార్ ప్రకాశ్‌బాబు, ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్ అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో విపత్కర పరిస్థితుల్లో ప్రజలను ఏ విధంగా సన్నద్ధం చేయాలనే అంశంపై వీఆర్వోలు, పంచాయతీ కార్యాదర్శులు, సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు.
- **కోవెలకుంట్ల:** స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జాతీయ విపత్తులు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణపై మండలస్థాయి అధికారులకు మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ పవన్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ..కరువు, భూకంపాలు, వరదలు, వేడితరంగాలు, కొండచరియలు, ఉష్ణమండల తుపానులు, అడవి మంటలు సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతాయన్నారు. వైపరీత్యాలు సంభవిస్తే ప్రాణ, ఆస్తినష్టం ఊహించనంతగా ఉంటుందన్నారు. ఇలాంటి విపత్తులు చోటుచేసుకునే సందర్భంలో అప్రమత్తంగా ఉండి ప్రాణాపాయం నుంచి బయట పడాలన్నారు. ఎంపీడీఓ వరప్రసాదరావు, ఎంఈఓ వెంకటసుబ్బయ్య, ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

గ్రామాల్లో పందుల స్వైర విహారం



కొలిమిగుండ్లలో రోడ్డుపై సంచరిస్తున్న పందులు

కొలిమిగుండ్ల: మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో పందులు స్వైర విహారం చేస్తుండడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గుంపులుగా వీధుల్లో తిరగడంతో పాటు ఇళ్ల ముందు పరిసరాలను అపరిశుభ్రం చేస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు. పలు మార్లు అధికారులకు చెప్పినా ప్రయోజనం లేకుండా పోతోందని ఆరోపిస్తున్నారు. కొలిమిగుండ్లలో చీకటి పడితే చాలు గుంపులుగా రోడ్లపైకి చేరుతుంటాయి. అటుఇటు సంచరించే సమయంలో ద్విచక్ర వాహనదారులు అవస్థలు పడుతున్నారు. రాకపోకలు సాగించే సమయంలో పందులు అకస్మాత్తుగా రావడంతో కింద పడిన సంఘటనలు ఉన్నాయి. వీధుల్లో చెత్త చెదారం ఉన్న చోట మరింత అపరిశుభ్రం చేస్తున్నాయి. పంచాయితీ అధికారులు చర్యలు తీసుకుని గ్రామాల్లో పందులు లేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

ఎస్సీ, ఎస్టీ రుణాలకు దరఖాస్తులు

కోవెలకుంట్ల: ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ల ద్వారా రుణాలు పొందేందుకు వచ్చే నెల 6వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునేందుకు గడువు ఉందని ఎంపీడీఓ వరప్రసాదరావు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఆంధ్రప్రగతి బ్యాంకు గుళ్లదూర్తికి ఒకటి, కోవెలకుంట్ల బ్రాంచ్‌కు రెండు, హెడ్‌డీఎఫ్‌సీ బ్యాంకుకు రెండు, ఎస్‌బీఐ బజార్ బ్రాంచ్‌కు రెండు, మెయిన్‌బ్రాంచ్‌కు రెండు, యూనియన్ బ్యాంకు ఈసీబీకి ఒకటి, మెయిన్ బ్రాంచ్‌కు రెండు చొప్పున యూనిట్లు కేటాయించారన్నారు. 50 సంవత్సరాల్లోపు వయస్సు కలిగిన ఎస్సీ, ఎస్టీ నిరుద్యోగులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.

సుంకులమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

కొలిమిగుండ్ల: గొర్విమానుపల్లె ఉన్నత పాఠశాల సమీపంలో ఉన్న సుంకులమ్మ ఆలయంలో మంగళవారం గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. కొద్ది రోజుల క్రితం చెట్టు కొమ్మ విరిగి పడడంతో ఆలయం దెబ్బతింది. భక్తులు, గ్రామస్తులు ఆలయానికి మరమ్మతులు చేపట్టి రంగులు వేసి అందంగా తీర్చిదిద్దారు. పనులు పూర్తి కావడంతో ఆలయాన్ని పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారికి విశేష పూజలు చేసి బోనాలు సమర్పించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

డోన్ టౌన్: జగదుర్తి సబ్‌స్టేషన్ పరిధిలో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు పనుల కారణంగా వెల్దుర్తి 33 కేవీ ఫీడర్ లైన్ షిఫ్టింగ్ చేస్తుండడంతో బుధవారం సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలతో పాటు ఫ్యాక్టరీలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ నాగేశ్వరరెడ్డి తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ ఉండదని చెప్పారు. అలాగే రైతులకు ఇచ్చే త్రీఫేస్ కరెంటు తెల్లవారుజామున 3 గంటల నుంచి ఉదయం 7 గంటల వరకు.. మళ్లీ మధ్యాహ్నం 3 నుంచి రాత్రి 8 గంటల వరకు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. పట్టణంలోని స్టేట్ బ్యాంక్ వద్ద నూతన 11 కేవీ లైన్ ఏర్పాటు పనులతో ఇందిరానగర్, తారకరామనగర్ తదితర ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కరెంటు ఉండదన్నారు.

నేడు పాలిసెట్

బనగానపల్లె రూరల్: పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాల కోసం బుధవారం నిర్వహించనున్న పాలిసెట్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వాసవీ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జీవీ రమణారెడ్డి మంగళవారం తెలిపారు. మూడు పరీక్ష కేంద్రాల్లో మొత్తం 831 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నట్లు చెప్పారు. ఇందులో కేజీఆర్ జూనియర్ కళాశాల కేంద్రంలో 200, శ్రీసాయి సిద్ధార్థ జూనియర్ కళాశాలలో 150, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 200, వాసవీ పాలిటెక్నిక్ కళాశాలలో 341 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు వెల్లడించారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష ఉంటుందని, విద్యార్థులు అరగంట ముందే కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు.

అందరి సహకారంతో అభివృద్ధి సాధ్యం



సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ మెట్ల సరళ

కోవెలకుంట్ల: ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతోనే పంచాయతీ అభివృద్ధి సాధ్యమవుతుందని సర్పంచ్ మెట్ల సరళ అన్నారు. మంగళవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. 2024–25 మార్చి నెలాఖరు నాటికి సంబంధించి గ్రామ పంచాయతీ జమా ఖర్చుల వివరాలను ఇన్‌చార్జ్ ఈఓ ప్రకాష్‌నాయుడు తెలియజేశారు. గ్రామ పంచాయతీకి రూ. 94.65 లక్షలు పన్నుల రూపంలో, రూ. 1.74 కోట్లు ఇతర వనరుల ద్వారా ఆదాయం చేకూరిందన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో గ్రామ పంచాయతీకి రూ. 2.68 కోట్ల ఆదాయం వచ్చినట్లు పేర్కొన్నారు. అనంతరం గ్రామ పంచాయతీ పరిధిలో వివిధ కాలనీల్లో సీసీరోడ్లు, డ్రెయినేజీ ఏర్పాటుకు ప్రతిపాదనలు చేశారు. ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి, వార్డుమెంబర్లు పాల్గొన్నారు.

హామీల అమల్లో ప్రభుత్వం విఫలం



ఆర్‌ఎస్ రంగాపురంలో మహిళలతో మాట్లాడుతున్న బుగ్గన అర్జున్‌రెడ్డి

బేతంచెర్ల: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 10 నెలలు అయినా హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని బుగ్గన అర్జున్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం మండల పరిధిలోని ఆర్‌ఎస్ రంగాపురం గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు ఆయన మాట్లాడారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అనేక సంక్షేమ పథకాలు అందేవని.. ఆర్థిక ఇబ్బంది లేకుండా కుటుంబాన్ని పోషించుకున్నామని మహిళలు ఆయన వద్ద వాపోయారు. టీడీపీ ప్రభుత్వం అనేక హామీలు ఇచ్చినా ఇంత వరకు అమలు చేయలేదన్నారు. మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రావాలని.. ఇందు కోసం ఎదురుచూస్తున్నామని తెలిపారు. అనంతరం గ్రామానికి చెందిన ఎంపీటీసీ సభ్యుడు నాగశేషు తనయుడు సురేష్, నాగేశ్వరి వివాహానికి హాజరయ్యారు. ఆయనతో పాటు ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రామచంద్రుడు, ఎంపీటీసీ మునేశ్వర్ రెడ్డి, నాయకులు నాగేశ్వర్‌రెడ్డి, తిమ్మయ్య, తిమోతి, మహబూబ్ బాషా తదితరులు ఉన్నారు.

కొనసాగిన రిలే నిరాహార దీక్షలు




బనగానపల్లె: రిలే నిరాహర దీక్షలో ఆర్టీసీ ఉద్యోగులు

కోవెలకుంట్ల: తమ డిమాండ్లు నెరవేర్చాలంటూ స్థానిక ఆర్టీసీ డిపో గేటు ఎదుట ఆర్టీసీ కార్మికులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు రెండో రోజు మంగళవారం కొనసాగాయి. ఈ సందర్భంగా నేషనల్ మజ్దూర్ యూనియన్ జిల్లా కార్యదర్శి శివరాం మాట్లాడుతూ.. ఆర్టీసీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, అక్రమ సస్పెన్షన్లు, రిమూవల్స్‌ను ఆపాలన్నారు. గత నాలుగు సంవత్సరాలుగా నిలిచిపోయిన పదోన్నతుల ప్రక్రియ వెంటనే చేపట్టాలని, గ్యారేజీ ఉద్యోగుల అపరిష్కృత సమస్యలు పరిష్కరించాలని కోరారు. మహిళా ఉద్యోగులకు ప్రభుత్వ జీఓ ప్రకారం పిల్లల సంరక్షణ సెలవులు మంజూరు చేయాలని, ఉద్యోగులకు అనారోగ్య సెలవులకు సంబంధించి పూర్తి వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. యూనియన్ డిపో అధ్యక్షుడు ఆచారి, కార్యదర్శి నరసింహులు, నాయకులు పుల్లారెడ్డి, రాముడు, కాశన్న, గురప్ప, ఎంవీఎస్‌రెడ్డి, లక్ష్మిరెడ్డి, వెంకటేశ్వర్లు, లక్ష్మి, కమల్, బాషా తదితరులు పాల్గొన్నారు.

- **బనగానపల్లె రూరల్:** స్థానిక ఆర్టీసీ డిపో ఎదుట ఎన్‌ఎంయూ నాయకులు నిరాహార దీక్షలు కొనసాగించారు. డిపో సెక్రటరీ శ్రీనివాసులు, గ్యారేజ్ అధ్యక్షుడు లక్ష్మన్న మాట్లాడుతూ.. ఆర్టీసీలో ఉద్యోగ భద్రత సర్క్యులర్ 1/2019ను వెంటనే అమలు చేయాలని, మహిళా ఉద్యోగుల పిల్లల సంరక్షణ సెలవును ఇవ్వాలని, ఎలక్ట్రిక్ బస్సులను ప్రభుత్వం లేదా సంస్థ ద్వారా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్‌ఎస్ వలీ, ప్రహ్లాద్, ఎల్లయ్య, రఫీ, బాబు, రమణ, రాజు, సలాం మియ్యా, నారాయణ, శివుడు, రసూల్ పాల్గొన్నారు.
- **డోన్ టౌన్:** డోన్ ఆర్టీసీ డిపో ఎదుట నిరాహార దీక్షలో ఎన్‌ఎంయూ డిపో కార్యదర్శి బాల మద్దయ్య, రాష్ట్ర కార్యదర్శి భద్రావతమ్మ, జిల్లా ప్రచార కార్యదర్శి డీవీఆర్ రెడ్డి, కండక్టర్‌లు హుస్సేన్, లీలావాణి, వెంకటలక్ష్మిదేవి, మస్తాన్‌బీ, డ్రైవర్‌లు నరసింహులు, షబ్బీర్‌బాషా కూర్చున్నారు. సమస్యలను పరిష్కరించాలని నినాదాలు చేశారు.

మురుగు సమస్య పరిష్కారం



నేడు: మురుగు తొలగించిన తర్వాత ఇలా



నాడు: రంగరాజుపేటలో రోడ్డుపై మురుగు

బనగానపల్లె రూరల్: పట్టణంలోని రంగరాజుపేట కాలనీలో రోడ్డుపై నిల్వ ఉన్న డ్రైనేజీని తొలగించారు. 'మురుగుతో అవస్థలు' అని మంగళవారం సాక్షిలో వచ్చిన వార్తకు అధికారులు స్పందించారు. బనగానపల్లె మేజర్ పంచాయతీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పారిశుద్ధ్య కార్మికులను కాలనీకి పంపించి రోడ్డుపై ఉన్న మురుగును తొలగింపజేశారు. కాల్వలో మురుగునీరు వెళ్లకుండా అడ్డుగా వేసిన మట్టిని తొలగించి మురుగు నీరు సక్రమంగా ప్రవహించేలా చర్యలు తీసుకున్నారు. సమస్య పరిష్కారం కావడంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు.

సాక్షి ఎఫెక్ట్

చేతిపంపునకు మరమ్మతులు



మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

కోవెలకుంట్ల: పట్టణ శివారులోని ఎస్సార్బీసీ కాలనీలో చేతిపంపునకు ఎట్టకేలకు మరమ్మతులు చేశారు. వేసవికాలం కావడంతో స్థానిక ఇందిరమ్మ, ఎస్సార్బీసీ కాలనీల్లో మంచినీటి పథకాలు పనిచేయక ఆయా కాలనీల ప్రజలు తాగు నీటికోసం అవస్థలు పడుతున్నారు. తాగునీటి కష్టాలపై సాక్షి దినపత్రికలో ఈ నెల 26వ తేదీ 'దాహం..దాహం' అన్న శీర్షికతో వార్త ప్రచురితమైంది. స్పందించిన ఎంపీడీఓ వరప్రసాదరావు, ఈఓపీఆర్డీ ప్రకాష్‌నాయుడు చేతిపంపునకు మరమ్మతులు చేపట్టాలని బోరుమెకానిక్ పాములేటిని ఆదేశించారు. మంగళవారం బోరును పరిశీలించారు. పైపులు దెబ్బతినడంతో ఏడు కొత్త పైపులను దించి నీరు వచ్చేలా మరమ్మతులు చేశారు. అలాగే ఇందిరమ్మ కాలనీలో మినరల్‌వాటర్‌ప్లాంట్‌లో నీటి శుద్ధి తర్వాత వచ్చే వేస్ట్‌వాటర్ వెళ్లేందుకు కావాల్సిన స్థలాన్ని అధికారులు పరిశీలిస్తున్నారు.



నీటిని పట్టుకుంటున్న మహిళ